క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే

ఇచ్చోడ: మండలంలోని దాబా(కె) గ్రామానికి చెందిన కామ్లే గౌతమికి శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నేరడిగొండలో రూ. 9 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధులతో బాధపడి ఆస్పత్రులలో చికిత్స తీసుకున్న వారు సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేరడిగొండ మాజీ ఎంపీపీ సజనలాల్, గణేష్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందిస్తున్న మౌనిష్‌రెడ్డి

సాత్నాల: భోరజ్ మండలం పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన మేడిపట్ల ఆశన్న ఇటీవల మరణించడంతో, వారి కుటుంబసభ్యులను పరామర్శించి, నిత్యావసర సరుకులను ప్రముఖ సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి అందించారు. ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్‌రెడ్డి, కిష్టారెడ్డి, వినోద్ రెడ్డి, ఉషారెడ్డి, కె. రహీం, రాములు, రూపేష్, గణేష్, సుబ్బన్న పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల గ్రామంలోని శ్రీరామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం శనివారంతో 82వ వారం పూర్తి చేసుకుంది. గత సంవత్సరం డిసెంబర్ 23న ప్రారంభమైన పారాయణం ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు భక్తుల సమక్షంలో నిర్వహించబడుతోంది. గ్రామస్తులు, విద్యార్థులు, మహిళలు, మండలి సభ్యులు పారాయణంలో పాల్గొంటున్నారు.

మాదిగ కుల సంఘం అధ్యక్షుడిగా లింగన్న

ఉట్నూర్‌రూరల్: మాదిగ కుల సంఘం మండల అధ్యక్షుడిగా కొల్లూరి లింగన్నను ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అదే విధంగా మాదిగల సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాంతరావు, జోస్, ఆనంద్‌రావు, ఆగిస్ట్, పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న భూపెల్లి శ్రీధర్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన సాగుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శనివారం మావల మండలంలోని వాఘాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వాఘాపూర్‌లో ప్రజాపాలన నిర్వహించామన్నారు. గృహజ్యోతి పథకంలో కరెంట్ బిల్లు మంజూరు కానీ లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించడం జరిగిందన్నారు. మాట ఇస్తే వెనుకడుగు వేసే చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు

ఖానాపూర్: కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థులకు యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. కొందరి ర్యాగింగ్ చేష్టలతో ప్రతిభ కల్గిన విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులున్నారు.

వరదనీటితో ముప్పు

- జోరుగా కురుస్తున్న వర్షాలు
- చేలలో నిలుస్తున్న నీరు
- పంట ఎదుగుదలపై ప్రభావం



తాంసి శివారులో పత్తిలో నిలిచిన వర్షపునీరు

తాంసి: వర్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందు నుంచే జిల్లాలో జోరుగా వర్షాలు కురిశాయి. జూన్ మొదటి వారంలో జిల్లాలో రైతులు పత్తి, సోయా, కందితో పాటు ఇతర పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలకు అనుకూలంగా జూన్ నెలలో వర్షాలు కురిశాయి. దీంతో ముమ్మరంగా రైతులు పంటలు సాగు చేశారు. ప్రస్తుతం ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొక్కలు దెబ్బతినే అవకాశం..

వరుసగా కురుస్తున్న వర్షాల వలన ప్రస్తుతం ఎదిగే దశలో ఉన్న మొక్కలు దెబ్బతినే అవకాశం ఉంది. పంట చేలలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో పత్తి, సోయా పంటలకు నష్ట వాటిల్లే అవకాశం ఉంది. వర్షపునీరు నిల్వ ఉండకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు తొలగించే విధంగా ఏర్పాట్లు చేసుకుంటే పంట ఎదిగే అవకాశం ఉందన్నారు.

చేలలో నిలుస్తున్న వర్షపునీరు..

వరుసగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటచేలలో వర్షపు నీరు నిలుస్తుంది. విత్తనాలు వేసి ఇప్పటికే దాదాపుగా 40 రోజుల అవుతుంది. ఎదిగే దశలో పత్తి, సోయాతో పాటు కంది పంటలలో వర్షాలతో నీరు నిలుస్తుండటంతో పంటలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంది. నీరు నిలిచి ఉండటంతో తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. తెగుళ్లు సోకితే ఆకులు రాలిపోయి కాండం ఎర్రబారి పురుగు ఉధృతి పెరుగుతుంది. తాంసి, భీంపూర్ మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపుగా 40 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. అత్యధికంగా పత్తి సాగు చేస్తున్నారు. వర్షాలతో ఎరువులు వేయడం, పిచికారీ చేయడం ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి



వరుసగా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రస్తుతం వర్షాలు లేనందున పంటచేలలో నిలిచిన నీటిని తొలగిస్తే పంట ఎదుగుదలపై ఎలాంటి ప్రభావం ఉండదు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టినందున రైతులు పంటలు ఎరువులతో పాటు మందులు పిచికారీ చేసే అవకాశం ఉంది.

– శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయాధికారి భీంపూర్

ఐక్యంగా ముందుకు సాగుదాం



సభ్యత్వం పొందుతున్న సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్: బస్సు యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండి ముందుకు సాగుదామని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్ ఆపరేటర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులతో స్థానిక టీఎన్జీవో భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. పలు సమస్యలపై చర్చించారు. బస్సుల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా సభ్యులను చేర్చుకున్నట్లు తెలిపారు. ఉపాధి కరవై అనేక ఇబ్బంది పడుతున్నామని, ట్యాక్స్‌లు చెల్లించేందుకు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా సభ్యులు రాష్ట్ర అసోసియేషన్ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి సౌకత్ ఉసేన్, ఇమ్రాన్, మహేందర్, పాషా, సదక్ అలీ, ఉరడే సుభాష్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. కొట(బి) గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయానికి మొదటి విడత రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన ఆడే గజేందర్‌ను గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు శ్రీనివాస్, అర్జున్, బబ్లూ, రవితేజ, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే పార్టీలో చేరిక

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసే తాను పార్టీలో చేరడం జరిగిందని తేజాపూర్ యువ నాయకుడు శేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఘనంగా జోగు తిరగడం



పూజలు చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టి సావర్‌గాం గౌడ గీత కార్మిక సంఘం, దుబ్బగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలు కార్యక్రమాన్ని గత మూడు రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం మావలలోని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి నివాసంలో జోగు తిరగడం కన్నుల పండువగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ప్రతిమకు సాంప్రదాయ పూజలు నిర్వహించి ఎల్లమ్మ ఒగ్గు కళాకారులు నృత్యం చేస్తూ ఎల్లమ్మ కథను వినిపించారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మన చారిత్రక సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ 15న మావల మండలంలోని దుబ్బగూడలో రేణుక ఎల్లమ్మ పెద్ద పట్నాం, ఎల్లమ్మ మునిరాజు కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాగరాజ్ గౌడ్, దేవేందర్ గౌడ్, సాయి చైతన్య గౌడ్, నరేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్‌ట్యాంక్



జైనథ్ మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి వెళ్లే దారిలోని వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. రూ. 28 లక్షల వ్యయంతో నిర్మించారు. నిర్మాణం చేపట్టి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ట్యాంక్‌ని నింపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– జైనథ్

గాంధీభవన్‌లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ సూచనల మేరకు అందుబాటులో ప్రజాప్రతినిధుల కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించి, సమస్యలు త్వరగా పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని, కానీ కేంద్రం దాటవేసే ధోరణిలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్డినెన్స్ తీసుకువచ్చి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేసే విధంగా రాష్ట్రం ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నర్సింలు, సత్యనారాయణ, ప్రశాంత్, సతీష్ సింగ్, రాజు, రవీందర్, మురళి పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: మండలంలోని కొఠ(బి) గామంలోని మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి రూ.20 లక్షల ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్, అర్జున్, బబ్లూ, రవితేజ్, పరమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తాంసి: మండలంలోని లీమ్‌గూడ గ్రామానికి చెందిన టీకం భారత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా.. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి భారత్ కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుడి భార్యకు రూ.10వేల నగదు అందజేశాడు.

పొంచి ఉన్న ప్రమాదం



కూలిపోయిన డ్రెయినేజీ పైకప్పు

నేరడిగొండ: మండల కేంద్రంలోని సర్వీసు రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీ ప్రమాదకరంగా మారింది. వాటి పైకప్పులు కూలిపోవడంతో ప్రజలు అందులో పడి గాయపడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి డ్రెయినేజీపై పైకప్పు ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

ప్రజాసేవలో ముందుండాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాసేవలు ఎల్లప్పుడు ముందుండాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. అనిల్ జాదవ్ యువసేన అధ్యక్షుడు, నేరడిగొండ మాజీ ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. యువతకు ఆదర్శంగా నిలవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలోని కళాకారుల్లో ప్రతిభ దాగి ఉందని, వారిని ప్రోత్సహించే దిశగా ప్రతిఒక్కరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణానికి చెందిన యువకులు రూపొందించిన «దారుణం» సినిమా రిలీజ్ వేడుకను స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సినిమాను విడుదల చేసిన దర్శక, నిర్మాతలను అభినందించారు. నిర్వాహకులు జోగు రామన్నను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కళాకారులకు సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు. పట్టణానికి చెందిన కళాకారులు దాదాపు ఏడాదిన్నర పాటు కష్టపడి సినిమాను రూపొందించడం అభినందనీయమన్నారు. చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా గణేష్ దేవ్ కంబ్లె నటించారు. జ్ఞానోబా దేవ్ కంబ్లె, మనీషా దేవ్ కంబ్లె ప్రొడ్యూసర్లుగా వ్యవహరించగా.. కో ప్రొడ్యూసర్‌గా పసుపుల దేవిదాస్ వ్యవహరించారు. హీరోయిన్‌గా శ్వేత పోత్ రాజ్ నటించారు. సినిమాను వీక్షించేందుకు అధిక సంఖ్యలో అభిమానులు హాజయ్యారు.

అందని మధ్యాహ్న భోజన బిల్లులు

- అప్పు చేసి వంట చేస్తున్న నిర్వాహకులు
- ప్రభుత్వం చెల్లించాలని వేడుకోలు



వంట చేస్తున్న నిర్వాహకులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటి వరకు ఐదు నెలలుగా బిల్లులు రాక నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒక వైపు బిల్లులు మరో వైపు జీతాలు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు, ఐదు నెలలుగా కూరగాయలు, వంట సరుకులు, కోడిగుడ్ల బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు.

తప్పని తిప్పలు..

కొన్ని నెలలుగా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. వంట సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు అప్పు చేసి తీసుకువస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట నూనె, సరుకులు, గుడ్ల ధరలు పెరిగిపోతుండటంతో నిర్వహణ భారంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నెల నెల మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించాలి



రోజు రోజుకు నిత్యవసర సరుకుల ధర పెరగడంతో ఆర్థిక భారం అవుతుంది. దుకాణాల్లో అప్పు చేసి వంటలు చేసి పెడుతున్నాం. నెలల తరబడి ఎవరూ సరుకులు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. పిల్లలకు కూడా సమయానికి వంట చేసి పెట్టేందుకు ఆస్కారం ఉంటుంది. అటు బిల్లులు, జీతాలు నెల నెల చెల్లించి ఆదుకోవాలి.

– గంగమ్మ, నిర్వాహకురాలు, ఉట్నూర్ జెడ్పీపాఠశాల

బీసీ రిజర్వేషన్ల ప్రకటనపై సంబురాలు



టపాసులు కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, బోథ్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బస్టాండ్ ఎదుట కార్యకర్తలు టపాసులు కాల్చారు. బీసీలకు రాజకీయ, సామాజికంగా న్యాయం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సంఖ్యను పెంచేలా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, పసుల చంటి, చట్ల ఉమేష్, షేక్ రజియా బేగం, నాజర్ అహ్మద్, యల్ల ఇంద్రారెడ్డి, సుద్దుల అరుణ్ రెడ్డి, చెట్లపల్లి అనిల్ పాల్గొన్నారు.

ఉట్నూర్ డిపోలో గుంతలు



ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అయినా ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరింది. రాత్రి వేళల్లో ఉద్యోగులకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ఉద్యోగులు కోరుతున్నారు.

– ఉట్నూర్‌రూరల్